క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు



గుంతకల్లు టౌన్: గుంతకల్లు నియోజకవర్గంలోని ముస్లిం లకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని, పవిత్ర ప్రార్థనలతో అల్లాహ్ దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. ముస్లింల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, మీ అందరి చల్లని దీవెనలు జగనన్న ప్రభుత్వానికి అందించాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే కోరారు.

ఆర్డీటీకి హుండీ డబ్బు అందజేత



ఆర్డీటీ ప్రతినిధులకు డబ్బు అందిస్తున్న గేట్స్ యాజమాన్యం

గుత్తి: ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ జయంతిని పురస్కరించుకుని స్పందించు సాయం అందించు కార్యక్రమంలో భాగంగా గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో హుండీ ఏర్పాటు చేశారు. హుండీ ద్వారా వచ్చిన రూ.20 వేలను శుక్రవారం కళాశాల యాజమాన్యం ఆర్డీటీ ప్రతినిధులకు సొమ్ము అందజేసింది. కార్యక్రమంలో గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వీరజవాన్ విగ్రహావిష్కరణ

పామిడి: వంకరాజుకాల్వలో వీరజవాన్ బోయ అమర్‌నాథ్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం వారు ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి, గుంతకల్ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డికి ఆహ్వానపత్రికలు అందజేశారు. గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ తలారి లక్ష్మీదేవి, తలారి నరసింహ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికి బీమా సొమ్ము అందిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన గోపాల్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద మృతుడి భార్య మల్లేశ్వరికి శుక్రవారం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ సులోచన, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, వైఎస్సార్ సీపీ నేత కంబయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈద్గా ఆవరణల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



ఈద్గా ఆవరణలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించే ఈద్గా మైదానాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. ఎస్‌జీపీ హైస్కూల్ వద్దనున్న ఈద్గా మైదానంతో పాటు పాతగుంతకల్లు హజరత్ మస్తాన్‌వలి దర్గా వద్దనున్న ఈద్గా మైదానాల్లో పారిశుధ్య కార్మికుల చేత శుభ్రం చేయించారు. జేసీబీ, డ్రోజర్‌ల ద్వారా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్, స్ప్రే చేయించారు. కమిషనర్‌తో పాటు వార్డు కౌన్సిలర్ జేసీబీ.చాంద్‌బాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎన్.వెంకటాంపల్లిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే వారిని ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీకి మాత్రమే దక్కిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చారన్నారు. నాలుగేళ్లలో ప్రజలకు ఇంత చేసిన ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో అక్కడక్కడా ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలన్న లక్ష్యంతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల కోసం తపిస్తూ ప్రజాక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జాషువా, ఎంపీపీ బీవీ మాధవి, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి, జెడ్పీటీసీ కదిరప్ప, కో ఆప్షన్ సభ్యుడు సాపియి బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్‌రావు, మండల సచివాలయ కన్వీనర్ గోవిందు నాయక్, మాజీ సర్పంచులు లోక్యానాయక్, నరసింహులు, సచివాలయ కన్వీనర్ నారాయణనాయక్, మాజీ ఎంపీటీసీ జయరామిరెడ్డి, కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి, నాయకులు శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి, దాసరి కదిరప్ప, రవీంద్ర నాయక్, ఇషాంత్, వడ్డే నాగరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీ సామాజిక సేవ అభినందనీయం



ఐఓసీ జీఎం కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: సామాజిక బాధ్యతతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) నిర్వహిస్తున్న ప్రజాహితమైన సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద ఐఓసీ సంస్థ రూ.15.40 లక్షల విలువ చేసే వైద్య పరికరాలు, సామగ్రిని అందజేసింది. ఏపీ, తెలంగాణా రాష్ట్రాల ఐఓసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్.కుమార్, డిపో చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్ ఈ వైద్య పరికరాలను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిప్రసాద్‌కు అందజేశారు. డీఎస్పీ నరసింగప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్.మోహన్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తో రాష్ట్రాభివృద్ధి

గుంతకల్లు రూరల్: సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నెలగొండ, వైటీ చెరువు, తిమ్మాపురం, కసాపురం, పులగుట్టపల్లి, నాగసముద్రంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

యాడికి: అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి వద్దకే సంక్షేమం అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని చందన సచివాలయం నం:2 కన్వీనర్ రాగుల వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జలదుర్గం రామాంజనేయులు అన్నారు. శుక్రవారం చందన గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

పండ్ల తోటల పెంపకం లాభదాయకం

గార్లదిన్నె: ఉపాధి హామీ ద్వారా రైతులు డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద పండ్లతోటలు పెంపకం చేపడితే లాభదాయకంగా ఉంటుందని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కృష్ణానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం బూదేడులో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కూలీలతో మాట్లాడుతూ నాణ్యమైన పనులు చేయాలని, అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామన్నారు. పండ్లతోటల పెంపకంతో రైతులు జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం శిరివరంలో గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. శాఖల వారీగా ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను పరిశీలించారు. అనంతరం గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డాక్టర్ గౌతమిని అడిగి తెలుసుకున్నారు.

పశుపోషణలో సాంకేతిక పద్ధతులు పాటించండి



పాడి రైతులకు సూచలిస్తున్న డీడీ రమేష్‌రెడ్డి

గార్లదిన్నె: పశుపోషణలో సాంకేతిక పద్ధతులు పాటించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ రెడ్డి పాడి రైతులకు సూచించారు. కేశవాపురంలో శుక్రవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు విజ్ఞానబడి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువులకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాల దిగుబడి అధికంగా పొందేందుకు రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం అత్యవసర సమయంలో పశువులకు ఇంటి దగ్గరకే వచ్చి వైద్యం అందించేందుకు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. అనంతపురము డివిజన్ ఏడీ పద్మనాభం, పశువైద్యులు ఆంజనేయులు నాయక్, రమేష్ పాల్గొన్నారు.

యూనిఫాం ధరించండి

గార్లదిన్నె: గ్రామ సచివాలయ సిబ్బంది యూనిఫాం తప్పక ధరించాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జంబులదిన్నెలో అమీనా బేగం, రమీజా బేగంకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరు కోసం ఆయన క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. గార్లదిన్నె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రేషన్ కార్డు జారీ ప్రక్రియపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

నూతన బోరు ప్రారంభం

గుత్తి రూరల్: బేతాపల్లిలో శుక్రవారం నూతన బోరును ఎంపీపీ విశాలాక్షి ప్రారంభించారు. గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నీటి సమస్యను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.8 లక్షలు మంజూరు చేయించారు. దీంతో గ్రామంలో నూతన బోరు, పైపులైన్, విద్యుత్ మోటారు, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పనులు పూర్తి కావడంతో గ్రామానికి తాగునీటి సరఫరాను ఎంపీపీ విశాలాక్షి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఎస్సీ కాలనీలో ఎంపీపీ పర్యటించారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించాలని కాలనీ వాసులు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ చిన్న ఆంజనేయులు, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే మహిళాభ్యున్నతి



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ విశాలాక్షి, మహిళలు

గుత్తి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళాభ్యున్నతి సాధ్యమని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. టి.కొత్తపల్లిలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఎంపీపీ వైఎస్సార్ ఆసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మూడో విడత మహిళా సంఘాలకు రుణమాఫీ చేయడంపై మహిళలు కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను మాఫీ చేసి ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. నవరత్న పథకాల ద్వారా అన్ని కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ఎన్‌సీ.రంగయ్య, ప్రవీణ్, నాగరంగయ్య, చంద్ర, ఈశ్వరయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పుష్పగిరి మాన్యం భూమి పరిశీలన

గార్లదిన్నె: కల్లూరులో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న పుష్పగిరి మాన్యం భూమిని శుక్రవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్పగిరి మాన్యం 7.7 ఎకరాల భూమిని ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కడప పుష్పగిరి మాన్యం ఉన్నతాధికారుల సూచన మేరకు భూమిని పరిశీలించి నివేదిక పంపుతామన్నారు. అంతకు ముందు యర్రగుంట్లలో దేవుని మాన్యం భూమిలో 50 సెంట్లు రెవెన్యూ అధికారులు గోదాములకు స్థలం కేటాయించడంతో వాటి స్థానంలో మరో ప్రాంతంలో దేవదాయ శాఖ అధికారులకు 50 సెంట్లు భూమి కేటాయించడంతో పరిశీలించారు. ఆలయ ఈఓ బాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని కసాపురం రోడ్డు, దత్తాత్రేయ ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న ఉమా మహేశ్వరి అనే మహిళ శుక్రవారం ఉదయం ఇంటి పైకప్పునకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన భర్త కిష్టప్ప, కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

ఈ-కేవైసీ నమోదు చేయించుకోండి

శింగనమల: పీఎం కిసాన్‌కు నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ చిన్నమ్మ శుక్రవారం సూచించారు. పీఎం కిసాన్ ఈ-కేవైసీ పెండింగ్ లిస్టులు ఆయా ఆర్బీకేల్లో ఉన్నాయని, ఈ-కేవైసీ పెండింగ్ ఉన్న రైతులందరూ మీసేవకు వెళ్లి చేయించుకోవాలన్నారు. ఈనెలాఖరులోపు నమోదు చేయించుకున్న రైతులకు వచ్చే నెలలో పీఎం కిసాన్ డబ్బు జమవుతుందన్నారు.

25న శంకరాచార్యుల జయంతి

తాడిపత్రి టౌన్: స్థానిక ఏటిగడ్డ పాలెంలోని నూతన బ్రాహ్మణ భవనంలో ఈనెల 25న జగద్గురు ఆదిశంకరాచార్య స్వామి జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈమేరకు బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాచకుండ జానకి రామశర్మ, కార్యదర్శి బాల ఎల్లయ్యస్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రాహ్మణులు తప్పక హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ఫయాజ్‌బాషా, వైద్యులు

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గ వ్యాప్తంగా ఫయాజ్‌బాషా ట్రస్టు సేవలు విస్తృతం చేస్తామని ఫయాజ్ బాషా ట్రస్టు చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత హీరాపురం ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. శక్రవారం పట్టణంలోని మౌలానా అబుల్ కలాం అజాద్ ఫంక్షన్ హాలులో టీబీ రోగులకు ఫయాజ్‌బాషా ట్రస్టు ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఫయాజ్‌బాషా మాట్లాడుతూ 52 మందికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశామని, నియోజకవర్గ వ్యాప్తంగా టీబీ రోగులను గుర్తించి పౌష్టికాహారాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రామలక్ష్మి, వైద్యులు సుధాకర్, సునీల్, డేనియల్, యస్దాన్, కౌన్సిలర్లు రంగనాథ్‌రెడ్డి, రియాజ్, వలి, నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, ఆలూరు ప్రసాద్‌రెడ్డి, వరదయ్య, బాబు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మస్తాన్‌వలికి సన్మానం



మస్తాన్‌వలిని సన్మానిస్తున్న రైల్వే జీఎం

గుంతకల్లు: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్‌ఎంయూ) గుంతకల్లు డివిజన్ సహాయ కార్యదర్శి మస్తాన్‌వలిని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం సికింద్రాబాద్‌లో పీఎన్‌ఎం మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న మస్తాన్‌వలిని జీఎం శాలువా, పూలమాలతో సత్కరించి ఆయన యూనియన్‌లో చేసిన సేవలను కొనియాడారు. ఎస్‌సీఆర్‌ఎం జనరల్ సెక్రటరీ శంకర్‌రావు, అధ్యక్షుడు శ్రీనివాస్, గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: తాడిపత్రి మండలం గంగాదేవిపల్లెకు చెందిన రాము శుక్రవారం అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వేములపాడు వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతోపాటు ట్రాక్టర్ యజమాని రాము, డ్రైవర్ కుళ్లాయప్పపై కేసు నమోదు చేశామన్నారు.

తాడిపత్రి: రూరల్ పరిధిలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

తాడిపత్రి అర్బన్: తిమ్మేపల్లికి చెందిన ఓ గొర్రెల వ్యాపారి అదృశ్యమయ్యాడు. పట్టణ ఎస్‌ఐ ధరణీబాబు వివరాల మేరకు..గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి గొల్ల నాగరాజు వ్యాపారంలో నష్టం వచ్చిందని చెప్పి బుధవారం బైక్‌పై తాడిపత్రికి చేరుకున్నాడు. రామచంద్ర లాడ్జి సమీపంలో బైక్‌ను వదిలి భార్య భాగ్యలక్ష్మికి ఫోన్ చేసి బైక్, ఫోన్ వదిలేసి వెళుతున్నట్లు చెప్పాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బుక్కరాయసముద్రం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వాతిలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి లక్ష్మి గర్భిణులను పరీక్షించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులకు చిప్పల ఈరప్ప, లక్ష్మీదేవి జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రశేఖర్ భోజన వసతి కల్పించారు. సీహెచ్‌ఓ మోహన్‌రావు, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, ఆనంద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ క్రికెట్ జట్టుకు తాడిపత్రి క్రీడాకారుడు

తాడిపత్రి టౌన్: తాడిపత్రి ఆర్డీటీ క్రికెట్ క్యాంపునకు చెందిన టి. మహేంద్రరెడ్డి జిల్లా సీనియర్ క్రికెట్టు జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల ఏప్రిల్ 21 నుంచి 26 వరకు కడపలో జరగనున్న అంతర్ జిల్లాల టోర్నీలో పాల్గొంటాడని తాడిపత్రి ఆర్డీటీ కోచ్ భార్గవ్ తెలిపారు.

ఇంటి పట్టాల అందజేత

గుత్తి: పట్టణంలోని కోట వీధి(12వ వార్డు)లో శుక్రవారం 90 డేస్ స్కీమ్‌లో భాగంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇంటి పట్టాలను కౌన్సిలర్ నజీర్, సచివాలయ, హౌసింగ్ ఉద్యోగులు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నజీర్ మాట్లాడుతూ అర్హులు ఉంటే ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

శింగనమల: ప్రజలు, రైతులకు వ్యతిరేకంగా పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి ప్రజలను కోరారు. శుక్రవారం శింగనమలలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి, కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న అనంతపురంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, మండల కార్యదర్శి తరిమెల రామాంజనేయులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ మండల నాయకులు వెంకట్రాముడు యాదవ్, నారాయణ, సీపీఎం నాయకులు దస్తగిరి, మద్దిలేటి, రైతు సంఘం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శివాలయం వద్ద ప్రచారభేరి వాల్ పోస్టర్లను విడుదల చేశారు.

పుట్లూరు: మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని సీపీఐ మండల కార్యదర్శి పెద్దయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఓబుళాపురం గ్రామంలో కరత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ముగ్గురి అరెస్ట్

గుంతకల్లు రూరల్: దంచర్లకు చెందిన రంగస్వామి, సుంకన్న, సుంకమ్మను శుక్రవారం వరకట్న వేధింపులు, గృహహింస చట్టం కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. భర్త రంగస్వామి, అత్తమామలు సుంకమ్మ, సుంకన్న వేధింపులు తాళలేక ఈనెల 8న దంచర్లకు చెందిన లక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. దీంతో కేసు నమోదు చేసుకొని మృతురాలి భర్తతో పాటు అత్తమామలను అదుపులోకి తీసుకొని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పామిడి: స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం కొత్తపల్లి కోనారెడ్డి, బంగారు శీనా సౌజన్యంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఆసుపత్రి వైద్యాధికారి ఎల్లప్ప ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే వారికి చలివేంద్రం ఉపయోగపడుతుందని వైద్యాధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర బాబు, నాగభూషణ్, నరసింహ, ధనుంజయ, ఓబులేసు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

బుక్కరాయసముద్రం: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సూచనల మేరకు జెడ్పీటీసీ భాస్కర్ ఆధ్వర్యంలో మండలంలో ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. శుక్రవారం పసులూరు కొత్తపల్లిలో జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూలింగ్ వాటర్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, ఏపీఓ శ్రీదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చికెన్ నారాయణస్వామి, సాకే లక్ష్మీరాయణ, ముత్యాల రంగ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు

గుత్తి: నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించే దుకాణాలపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో మొత్తం 44 దుకాణాలపై దాడులు చేసి రూ.3 వేల జరిమానా విధించారు. మరోసారి ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని దుకాణదారులను అధికారులు హెచ్చరించారు.

ఈద్గాలో ఏర్పాట్ల పరిశీలన

తాడిపత్రి అర్బన్: రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గాలో ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత హీరాపురం ఫయాజ్‌బాషా, వక్ఫ్‌బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్లు షాషావలి, మహబూబ్‌బాషా తదితరులు పరిశీలించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఈద్గాలో శనివారం ఉదయం నిర్వహించే సామూహిక ప్రార్థనలను దృష్టిలో ఉంచుకుని షామియానాలతో పాటు కార్పెట్, కొళాయిలు, తాగునీరు తదితర మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫయాజ్‌బాషా మాట్లాడుతూ అధికారులు ఈద్గాలోఅన్ని ఏర్పాటు చేశారని, ముస్లింలు పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

నిత్యావసరాలు సకాలంలో అందించండి

యల్లనూరు: కార్డుదారులకు నిత్యావసర సరుకులు సకాలంలో అందించాలని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రభుత్వ చౌకడిపో డీలర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు.

ఘనంగా జుమ్మతుల్‌విదా నమాజులు

గుత్తి రూరల్: గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింల పవిత్ర రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం(జుమ్మతుల్ విదా)ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుంతకల్లు, పామిడి, గుత్తి, గుత్తి ఆర్ఎస్, మండలంలోని బసినేపల్లి, కొత్తపేట, మాముడూరు, అబ్బేదొడ్డి, ఊటకల్లు, రజాపురం గ్రామాల్లో ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక నమాజులు చేశారు. ముస్లింలు పవిత్ర దినంగా భావించే శుక్రవారం రంజాన్ మాసంలో చివరిది. దీంతో చివరి శు క్రవారం ముస్లింలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సం దర్భంగా మధ్యాహ్నం 1 గంట సమయంలో మసీదుల్లో మత గురువులు మహమ్మద్ ప్రవక్త (సల్లల్ల హు అసల్లం)జీవిత విశేషాలను వివరించారు. రంజాన్ ఉపవాసాల్లో(రోజా)పాటించాల్సిన నియమాలను వారికి తెలియజేశారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: కరిడికొండ గ్రామంలో ఓ మహిళ నాటుసారా విక్రేతను సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ పోలీసులు వివరాల మేరకు... గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే మహిళ గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు సెబ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు శుక్రవారం గ్రామంలో దాడులు నిర్వహించి మహిళా విక్రేతను అరెస్టు చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐ అలీ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.